క్లుప్తంగా

సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలం



చాట్రాయి: ప్రజా సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ ఎంఎల్ (లిబరేషన్) రాష్ట్ర కార్యదర్శి డి.హరనాథ్ అన్నారు. ఆదివారం మండలంలోని చీపురుగూడెం, మర్రిబంధం గ్రామాల్లో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు నాలుగు నెలల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలను పరిష్కరించకుండా తిరుపతి లడ్డూ ఇంకా రకరకాల సమస్యలను తెరపైకి తీసుకొచ్చి పాలనను గాలికి వదిలేశారని ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 4న విజయవాడలో జరిగే ప్రజా హక్కుల ర్యాలీని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పొలిట్ బ్యూరో సభ్యుడు వి శంకర్, రాష్ట్ర కార్యదర్శి బంగార్రాజు, జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

మైలవరం: మైలవరం శ్రీ కోట మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద కార్తిక మాసం సందర్భంగా ఆదివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. మైలవరం గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పండితులు రాహుల్ పర్యవేక్షణలో 40 జంటలు వ్రతంలో పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

ఆలయ నిర్మాణానికి దాతల విరాళం

తిరువూరు: స్థానిక పాటిమీద దాసాంజనేయ స్వామి దేవాలయ నిర్మాణానికి ఆర్య వైశ్య ప్రముఖులు జంగాల సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు జంగాల శివలింగ ప్రసాద్ కుటుంబ సభ్యులు ఆదివారం విరాళం అందజేశారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిమిత్తం రూ.2,00,120 దేవాలయం ట్రస్ట్ సభ్యులకు అందజేశారు. రిటైర్డ్ ఉద్యోగి జీజీ ప్రసాద్ ఆలయ నిర్మాణానికి రూ.30 వేలు అందజేశారు.

నిత్యావసరాలు పంపిణీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఇటీవలి కాలంలో వరద ముంపునకు గురైన బాధితులకు లయన్స్ క్లబ్ ఆఫ్ కొండపల్లి, వీఆర్కే నగర మహిళ లయన్స్ క్లబ్ వారు సంయుక్తంగా 50 మంది బాధితులకు నిత్యావసర సరుకుల కిట్‌ను ఆదివారం పంపిణీ చేశారు. లయన్ దేవినేని జోనికుమారి, దేవినేని కిశోర్‌కుమార్, నేపా సత్యనారాయణ, వెనిగళ్ల అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

రఘునందన్‌కు ఎక్స్ రే జాతీయ కవితా పురస్కారం

తిరువూరు: ప్రముఖ కవి, అభ్యుదయ రచయితల సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి రేపాక రఘునందన్‌కు ఎక్స్ రే సాహితీ సంస్థ జాతీయ స్థాయిలో నిర్వహించిన వచన కవితా పోటీల్లో మా ఊరి గొడుగై కవితకు ఉత్తమ కవితా పురస్కారం లభించింది. ఈ జాతీయ పురస్కారాన్ని ఆదివారం విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్‌లో ప్రముఖ సాహితీవేత్తలు మొండెపు ప్రసాద్, మంగారి రాజేందర్, సంస్థ అధ్యక్షుడు కొల్లూరి, ప్రధాన కార్యదర్శి బి. ఆంజనేయరాజు ప్రదానం చేశారు.

శాలాహార నిర్మాణానికి రూ. లక్ష విరాళం

తిరువూరు: స్థానిక రాజుపేట అష్టలక్ష్మి ఆలయంలో శాలాహార నిర్మాణానికి బొడ్డు మల్లికార్జునరావు కుటుంబ సభ్యులు విరాళంగా ఒక లక్ష వెయ్యి నూట పదహార్లు అందజేశారు. విరాళాన్ని ఆలయ ధర్మకర్త కాసులపాటి పద్మనాభ శాస్త్రికి ఆదివారం అందజేశారు.

హైందవ శంఖారావం సభను జయప్రదం చేయాలి

తిరువూరు: హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కోరుతూ విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5న విజయవాడలో చేపట్టిన హైందవ శంఖారావం భారీ బహిరంగ సభను ప్రతి ఒక్క హిందువు జయప్రదం చేయాలని హైందవ శంఖారావం నాయకులు తిరువూరు ఖండ కన్వీనర్ ఎల్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. తిరువూరు ఖండ సమావేశం స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ విద్యా భారతి సంఘటన కార్యదర్శి కన్నా భాస్కర్, వీహెచ్‌పీ ప్రతినిధులు వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసాచారి, క్రాంతి, కేశవసింగ్, నాళ్లా సురేష్, తిరుపతయ్య, విజయలక్ష్మి పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం సీసాలు స్వాధీనం

మైలవరం: మైలవరం నియోజకవర్గం జి.కొండూరు మండలం సున్నంపాడు గ్రామంలో మైలవరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ అధికారులు ఆదివారం జరిపిన దాడుల్లో గ్రామానికి చెందిన షేక్ ఉద్దండు నుంచి 50 మద్యం సీసాలు(తెలంగాణ మద్యం) స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ జె. శ్రీనివాస్ తెలిపారు. తెలంగాణ మద్యం అమ్ముతుండగా అతనిని అరెస్టు చేసి మైలవరం ఎక్సైజ్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ ఎం. దుర్గాప్రసాదరావు, కానిస్టేబుల్స్ సర్వేష్, సాయికృష్ణ, రమేష్, రాజకుమార్ పాల్గొన్నారు.

ఇరుకు గదులతో ఇబ్బందులు

తిరువూరు పట్టణంలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)ను నాలుగు నెలల కిందట అద్దె భవనంలోకి మార్చారు. భవనంలోని గదులు ఇరుకుగా ఉండటంతో పాటు మందులు, వైద్య సామగ్రి అందులోనే ఉంచుతున్నారు. సిబ్బంది కూర్చునేందుకు కూడా చోటు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. యూపీహెచ్‌సీ నూతన భవన నిర్మాణ నిధుల లేమితో మధ్యలోనే నిలిచిపోయింది. నిధులు మంజూరుచేసి నిర్మాణాన్ని పూర్తిచేయాలని ప్రజలు, రోగులు కోరుతున్నారు.

- నిర్మాణంలో యూపీహెచ్‌సీ
- నిధుల లేమితో నిలిచిన పనులు
- అద్దె భవనంలో ఇరుకు గదుల్లోనే రోగులకు సేవలు
- రోగులు, సిబ్బందికి తప్పని ఇబ్బందులు



తిరువూరులో ప్రారంభం కాని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం (ఇన్‌సెట్) తిరువూరులో ఇరుకు భవనంలో కొనసాగుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

తిరువూరు: తిరువూరు పట్టణంలో నాలుగేళ్ల కిందట ఏర్పాటు చేసిన అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చాలీచాలని ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్నారు. గతంలో పాత బస్టాండు సెంటరులోని అన్న క్యాంటీన్ భవనంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా రోగులకు సత్వర సేవలందేవి. ఎన్నికల అనంతరం అన్న క్యాంటీన్ల ప్రారంభంతో ఆరోగ్య కేంద్రాన్ని శాంతినగర్‌లోని ఒక మారుమూల భవనంలోకి మార్చివేశారు. ఆరోగ్య కేంద్రాన్ని మార్పు చేశారనే విషయం రోగులకు కూడా తెలియకపోవడం గమనార్హం. యూపీహెచ్‌సీ కోసం ఎన్ఎస్‌పీ కాలనీలో నిర్మించిన పక్కా భవనం నిధుల కొరతతో నిలిచిపోయింది.

సౌకర్యాల లేమి..

శాంతినగర్‌లోని అద్దె భవనంలో ఏర్పాటు చేసిన అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇరుకు గదులతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. మందులు, ఇతర వైద్య సామగ్రితోనే గదులన్నీ నిండిపోగా, సిబ్బంది కూర్చునే అవకాశం కూడా లేదు. రోగులకు వైద్యసేవలందించేందుకు సైతం ఈ కేంద్రంలో సరైన సౌకర్యాలు లేవు. తాత్కాలికంగా ఈ కేంద్రాన్ని ప్రైవేటు భవనంలో ఏర్పాటు చేశారు. పలు ప్రభుత్వ భవనాలు ఖాళీగా ఉన్నా తరలించేందుకు అధికారులు ప్రయత్నించడం లేదు.

నిరుపయోగంగా పక్కా భవనం

యూపీహెచ్‌సీ భవన నిర్మాణానికి గత ప్రభుత్వంలో రూ.80 లక్షల నిధులు మంజూరు కాగా 70 శాతం పనులు పూర్తయ్యాయి. ఇంకా రూ.43 లక్షల మేర నిధులు అవసరమని, ఇవి మంజూరైతే పనులు పూర్తి చేయవచ్చని ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం రూ.23 లక్షలు మంజూరు చేసింది. గత ఆరు నెలలుగా అధికారులు భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టరును కోరుతున్నా ప్రయోజనం లేదు. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి భవన నిర్మాణ పనులు పూర్తి చేసి అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అందులోకి తరలించాలని భావిస్తున్నారు.

పనులు పూర్తిచేస్తాం

అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణ పనులు ఇంకా 20 శాతానికి పైగా పూర్తి కావలసి ఉంది. తొలి విడత రూ.23 లక్షలు మంజూరయ్యాయి. పనులు పూర్తి చేసి 2025 ఏప్రిల్‌లో భవనాన్ని ప్రారంభిస్తాం.

– లోవరాజు,
నగర పంచాయతీ కమిషనర్, తిరువూరు

కార్యకర్తలకు అండగా ఉంటాం



సమావేశంలో మాట్లాడుతున్న స్వామిదాస్

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాస్

తిరువూరు: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ఎటువంటి సమస్య వచ్చినా తాను అన్ని వేళలా అండగా ఉంటానని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాస్ అన్నారు. వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ కార్యకర్తల సమావేశం తిరువూరు సూర్యా ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగింది. స్వామిదాసు మాట్లాడుతూ ఎన్నికల అనంతరం గ్రామాల్లో కార్యకర్తలను అకారణంగా అధికార పార్టీ నాయకులు వేధిస్తున్నారన్నారు. పోలీసులు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా స్టేషన్లకు పిలిచి వేధిస్తున్నారని సోషల్ మీడియా కార్యకర్తలు చెబుతున్నారని, ఇటువంటి ఘటనల్లో తాను వారికి అండగా నిలబడతానని స్వామిదాస్ హామీ ఇచ్చారు. గెలుపు, ఓటములు శాశ్వతం కాదని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం ఖాయమని స్వామిదాస్ చెప్పారు. కార్యకర్తలు ఎప్పుడు అవసరం వచ్చినా తనకు సమాచారం ఇస్తే వెంటనే వస్తానని, వారి సమస్యలు తనవిగా భావిస్తానని తెలిపారు. అధికార పార్టీ బెదిరింపులకు భయపడవద్దని, ధైర్యంగా ఎదుర్కొందామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళదామని, ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీల అమలుకు నిలదీద్దామని స్వామిదాస్ పిలుపునిచ్చారు. నియోజకవర్గ పార్టీ నాయకులు మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, నల్లగట్ల సుధారాణి, వీరారెడ్డి, రేగళ్ల మోహనరెడ్డి, శేషగిరిరావు, సీతారామయ్య, నరసారెడ్డి, కాలసాని గోపాల నాగేశ్వరరావు, వెలుగోటి విజయలక్ష్మి, జాకీర్, సురేష్, జెడ్పీటీసీ సభ్యులు గన్యా, శామ్యూల్ పాల్గొన్నారు.

రహదారిపైకి మురుగునీటి ప్రవాహం

విస్సన్నపేట: స్థానిక శివాలయం సమీపంలో డ్రెయినేజీలోని మురుగు నీరు రహదారిపైకి ప్రవహించడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. మురుగు నీరు రహదారిపై ప్రవహించడంతో దుర్గంధం వెదజల్లుతోంది. సమీపంలోనే సాయిబాబా దేవాలయం, శివాలయం ఉండటంతో భక్తులకు అసౌకర్యంగా ఉంటోందని స్థానికులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మురుగునీరు రోడ్డుపైకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



రహదారిపై ప్రవహిస్తున్న మురుగు నీరు

ప్రమాదాలకు నెలవుగా ఆర్‌అండ్‌బీ రోడ్లు

చాట్రాయి: గుంతలు లేని రోడ్ల నిర్మాణమే ధ్యేయం అంటున్న కూటమి ప్రభుత్వం మాటలు నీటి మూటలుగా మిగులుతున్నాయి. చాట్రాయి మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు ఆర్‌అండ్‌బీ రోడ్లపై పడిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. చాట్రాయి, ఆరుగొలనుపేట, చనుబండ, నరసింహారావుపాలెం, పర్వతాపురం – చీపురుగూడెం, పోలవరం – మంకొల్లు రోడ్లు అడుగడుగునా గుంతలతో అధ్వానంగా మారాయి. ఈ రోడ్లపై రాకపోకలకు వాహన చోదకులు భయాందోళనకు గురవుతున్నారు. ఆరుగొలనుపేట మెయిన్ రోడ్డుపై ఇటీవల గుంతలోపడి చాట్రాయి గ్రామానికి చెందిన వ్యక్తి చెయ్యి విరిగింది. బాధితుడు సత్తుపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. చిన్నంపేట కోటపాడు మెయిన్ రోడ్డులో దళితవాడ వద్ద ఏర్పడిన గుంతలో ట్రాక్టర్ పడి పల్టీ కొట్టింది. ఆ సమయంలో ట్రాక్టర్‌పై ఉన్న కూలీలకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇటీవల మంత్రి పార్థసారథి మండల పర్యటనలో జేసీబీతో గోతులు పూడ్చే కార్యక్రమం చేపట్టినా.. మండలంలో ఎక్కడా గోతులు పూడ్చడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ రోడ్లపై పడిన గుంతలకు పూడ్చించి, ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.



ధ్వంసమైన చనుబండ-నరసింహారావుపాలెం రోడ్డు

ఉత్సాహంగా వన సమారాధనలు

విజయవాడరూరల్: విజయవాడ క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన కార్యక్రమం ఆదివారం కొత్తూరు తాడేపల్లి గ్రామంలోని సత్యనారాయణరాజు మామిడితోటలో జరిగింది. తొలుత సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. ఆల్ ఇండియా క్షత్రియ ఫెడరేషన్ చైర్మన్ పీవీ గిరి మాట్లాడుతూ ఢిల్లీలో క్షత్రియ భవన నిర్మాణం పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, ఆల్ ఇండియా క్షత్రియ ఫెడరేషన్ వైస్ చైర్మన్ ఆంజనేయరాజు, కార్పొరేషన్ డైరెక్టర్ డీజీపీఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

రూరల్ రెవెన్యూ సిబ్బంది వన సమారాధన

జక్కంపూడిలోని అటవీశాఖకు చెందిన వనం-మనం పార్కులో విజయవాడ రూరల్ మండల రెవెన్యూ కార్యాలయ సిబ్బంది కార్తిక వన సమారాధన నిర్వహించారు. తహసీల్దార్ బి.సుగుణ, డీటీ బేబిరాణి, ఆర్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

- **జి.కొండూరు(మైలవరం):** యాదవుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. జి.కొండూరు మండలం కుంటముక్కల గ్రామంలోని మామిడి తోటలో ఆదివారం జరిగిన యాదవ సంఘం వన సమారాధనలో ఆయన పాల్గొని మాట్లాడారు. చెన్నుబోయిన చిట్టిబాబు, పటాపంచల నరసింహారావు, నక్కనబోయిన తిరుపతిరావు తదితరులు ఉన్నారు.



గంపలగూడెంలో సత్యనారాయణస్వామి వ్రతం

- **గంపలగూడెం:** గంపలగూడెం ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో తోటమూలలో కొల్లా సూర్యప్రకాష్‌రావు మామిడి తోటలో వన సమారాధన నిర్వహించారు. 40 మంది దంపతులు పీటలపై కూర్చుని వ్రతాన్ని ఆచరించారు. మధ్యాహ్నం నిర్వహించిన సామూహిక వన భోజనాల కార్యక్రమంలో ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలకు కుర్చీలాట, హౌజి పోటీలు నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

మైలవరం: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని చిలుకూరువారిగూడెం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు డీవీవీఎస్ ప్రసాద్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మైలవరం శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఇటువంటి పోటీలలో పాల్గొనడం వలన విద్యార్థుల్లో సృజనాత్మకత, పోటీతత్వం పెరుగుతుందని, భవిష్యత్‌లో పోటీ ప్రపంచంలో ఉన్నత స్థానాలకు ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కవి సమ్మేళనం..

జి.కొండూరు(మైలవరం): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జి.కొండూరు శాఖ గ్రంథాలయంలో ఆదివారం కవి సమ్మేళనం జరిగింది. అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్, రన్నింగ్ తదితర అంశాలలో పోటీలు నిర్వహించామని గ్రంథాలయాధికారి వి. విజయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో కవులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు

తిరువూరు: స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయంలో ఆదివారం జూనియర్స్, సీనియర్స్‌కు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం జూనియర్స్‌కు, సీనియర్స్‌కు మ్యూజికల్ చైర్స్ ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 110 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథాలయాధికారి పద్మావతి పాల్గొన్నారు.

కవుల చిత్ర పటాల ప్రదర్శన

గంపలగూడెం: పెనుగొలను శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు, కవి సమ్మేళనం, సెమినార్, రచయితల సందేశాలు, కవులు చిత్ర పటాల ప్రదర్శన నిర్వహించారు.



మైలవరంలో వక్తృత్వ పోటీలో పాల్గొన్న విద్యార్థులు



జి. కొండూరులో విద్యార్థులకు సూచనలిస్తున్న గ్రంథాలయాధికారి విజయలక్ష్మి



తిరువూరులో చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



పెనుగొలనులో చిత్ర లేఖనం పోటీలో వేసిన చిత్రాలను చూపుతున్న విద్యార్థులు

ప్రగతి స్కూల్స్ కరస్పాండెంట్ వి. వెంకటరెడ్డి, షిర్డీ సాయిబాబా సేవా కమిటీ సభ్యులు నారాయణరావు, విద్యార్థులు, గ్రంథాలయ నిర్వహణాధికారి జె. శ్రీలత పాల్గొన్నారు.

పోటీ తత్వానికి గ్రంథాలయాలే వారధి

ముసునూరు: విద్యార్థుల్లో స్ఫూర్తి, పోటీతత్వానికి గ్రంథాలయాలే వారధని వక్తలు పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం గోపవరం బ్రాంచి గ్రంథాలయాధికారి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో జూనియర్లకు, సీనియర్లకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థి జీవితంలో గ్రంథాలయాల ప్రాధాన్యాన్ని ఉపాధ్యాయుడు పాముల సుబ్బారావు పాఠకులకు, చిన్నారులకు వివరించారు. అనంతరం గ్రంథాలయోద్యమం చరిత్రపై పలువురు చిన్నారులు మాట్లాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ సభ్యులు, పలువురు పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- **చాట్రాయి:** మండలంలోని చనుబండ గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శ్రీకాంత్, ఉపాధ్యాయులు చిట్టిబాబు డి.వెంకట్రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

ఆగిరిపల్లి: మండలంలోని కనసానపల్లిలో పేకాట శిబిరంపై ఎస్ఐ శుభశేఖర్ తన సిబ్బంది కలిసి దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.10,500 స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు.

వేంకటేశ్వరస్వామి సేవలో ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: నెక్కలం గొల్లగూడెంలోని సంతాన వేంకటేశ్వర స్వామిని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు దర్శించుకున్నారు. ఆదివారం నెక్కలం గొల్లగూడెంలోని సంతాన వెంకటేశ్వర స్వామి ఆలయ శిఖర పునః ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతాప్ అప్పారావుకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి శాలువాతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు, జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు, సర్పంచ్ లింగవరపు రమేష్, ఎంపీటీసీ సభ్యుడు గుర్రం శ్రీనివాసరావు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ హనుమంతరావు, పెరిక కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ అత్తి పార్వతి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు బెజవాడ రాంబాబు, ముక్కపాటి వెంకటేశ్వరరావు, గోళ్ల ఇస్సాకు, కిరణ్‌కుమార్, సర్పంచులు అత్తి మురళి, మేము రాజు, వాకా సక్కేశ్వరరావు పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ప్రతాప్ అప్పారావు

ముగిసిన జోన్-2 క్రీడా పోటీలు

ఎ.కొండూరు: మండలంలోని కృష్ణారావుపాలెం గురుకుల కళాశాలలో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న జోన్-2 క్రీడా పోటలు శనివారం రాత్రితో ముగిశాయి. సీనియర్స్ విభాగంలో 30 వేల మీటర్ల పరుగు పందెంలో ప్రథమస్థానం ఎల్ వంశీ (కృష్ణారావుపాలెం), ద్వితీయ స్థానం ఎల్. సిద్దు (తిరువూరు), తృతీయస్థానం ఎస్. హర్షిత్ (ఎల్‌బీ చర్ల) సాధించారు. డిస్కస్‌త్రోలో ప్రథమస్థానం ఎస్. సతీష్‌కుమార్ (గోడి), ద్వితీయస్థానం కె. బాబి (గోడి), తృతీయస్థానం డి. కమల్‌కుమార్ (ఆరుగొలను), జావెలింగ్‌త్రోలో ప్రథమ ఎస్. సతీష్‌కుమార్ (గోడి), ద్వితీయస్థానం ఎస్. అభిషేక్ (కృష్ణారావుపాలెం), తృతీయస్థానం ఎం. మనోజ్ (ఆరుగొలను), హైజంప్‌లో ప్రథమస్థానం కె. దినేష్ (ఎ. మల్లవరం), ద్వితీయస్థానం కె.ముకేష్ (కొత్తూరు), తృతీయస్థానం కె. చరణ్‌తేజ (కొత్తూరు) నిలిచారు. షార్ట్‌పుట్‌లో ప్రథమస్థానంలో టి. బాలాజీ (కొత్తూరు), ద్వితీయస్థానం డి. నిరీక్షణ్, తృతీయస్థానం ఎం. అభిషేక్ (కృష్ణారావుపాలెం), 400 X100లో ప్రథమ స్థానంలో కృష్ణారావుపాలెం జట్టు, ద్వితీయ స్థానం కొత్తూరు జట్టు, తృతీయ స్థానం ఎల్ఎన్ పురం జట్టు, నాలుగో స్థానం తిరువూరు జట్టు, హ్యాండ్‌బాల్ విభాగంలో ప్రథమస్థానం కృష్ణారావుపాలెం, ద్వితీయస్థానం తిరువూరు, వాలీబాల్ విభాగంలో ప్రథమ స్థానం ఎ. మల్లవరం, ద్వితీయస్థానం ఎల్‌బీ చర్ల, ఖోఖోలో ప్రథమస్థానం ఆరుగొలను, ద్వితీయస్థానం తిరువూరు, కబడ్డీలో ప్రథమస్థానం పెదవేగి, ద్వితీయ స్థానం ఎల్‌బీచర్ల జట్టు కైవసం చేసుకున్నాయి. జూనియర్స్ విభాగంలో మూడు వేల మీటర్ల పరుగు పందెంలో ప్రథమస్థానం సీహెచ్ కృష్ణ ప్రసన్న (ఎ.మల్లవరం), ద్వితీయస్థానం ఎ. సాయితి (ఎల్ఎన్‌పురం), హ్యాండ్ బాల్ విభాగంలో ప్రథమస్థానం గోడి జట్టు, ద్వితీయ స్థానం ఎల్ఎన్‌పురంలో నిలిచారు. డిస్కస్‌త్రోలో ప్రథమస్థానం డి. తరుణ్‌నాయక్ (కృష్ణారావుపాలెం), ద్వితీయస్థానం ఎస్. నవదీప్ (పి. గన్నవరం), తృతీయస్థానం కె. రాజు (పెదవేగి), జావెలిన్‌త్రోలో ప్రథమస్థానం సీహెచ్ క్రాంతికిరణ్ (గోడి), ద్వితీయ స్థానం టి. దిలీప్ (చింతలపూడి), తృతీయస్థానం ఎల్. చరణ్ (పి.గన్నవరం), హైజంప్‌లో ప్రథమస్థానం బి. సుజన (పామర్రు), ద్వితీయస్థానం పి. నాగబాబు (పెదవేగి), తృతీయస్థానం టి. నిఖిల్ (చింతలపూడి) సాధించారు. వాలీబాల్‌లో ప్రథమస్థానం తుని, ద్వితీయస్థానం ఎల్ఎన్ పురం, 400X100 మీటర్ల రిలే విభాగంలో ప్రథమ స్థానం ఎల్ఎన్ పురం, ద్వితీయ స్థానం పెదవేగి, తృతీయస్థానం తిరువూరు జట్టు నాలుగో స్థానం పామర్రు జట్లు సాధించాయి. గేమ్స్, స్పోర్ట్స్ విభాగంలో అత్యధిక పాయింట్లతో కృష్ణారావుపాలెం జట్టు అగ్రస్థానంలో నిలిచి ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించింది. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ కె. రాజ్యలక్ష్మి, కృష్ణా జిల్లా సమన్వయ అధికారి కె. ప్రేమావతి, స్పోర్ట్స్ కో- ఆర్డినేటర్ కె. జయరాజు, ప్రిన్సిపాల్ కె. సిద్దయ్య, పీడీ కె. రత్నకిశోర్ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

దివ్యాంగులకు వస్త్రాలు అందజేత

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): సత్యసాయి సేవా సమితి విజయవాడ సీతారామపురం ఆధ్వర్యంలో ఆదివారం కొత్తూరు తాడేపల్లి గ్రామంలోని వృద్ధులు, దివ్యాంగులు 56 మందికి నూతన వస్త్రాలు, స్వామి వారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో సేవాదళ్ సభ్యులు, బాల వికాస్ పిల్లలు, గ్రామస్తులు, కన్వీనర్ ఎస్‌వీఎల్ నరసింహారావు పాల్గొన్నారు.

డిసెంబర్ 4న ప్రజా హక్కుల సభ

ముసునూరు: విజయవాడలో డిసెంబర్ 4వ తేదీన నిర్వహించనున్న ప్రజా హక్కుల సభను విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ మండల కన్వీనర్ వేముల బక్కయ్య పిలుపునిచ్చారు. రమణక్కపేటలో ఆదివారం అఖిల భారత గ్రామీణ కార్మిక సంఘ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డిసెంబర్ నాలుగో తేదీన విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో నిర్వహించే ప్రజా హక్కుల సభకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య హాజరై ప్రజా సమస్యలపై, ప్రజల తరఫున ప్రభుత్వాలను ప్రశ్నిస్తారన్నారు. ఈ సభకు వందలాదిగా ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సంఘ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు పీజీఆర్ఎస్ కార్యక్రమం

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీకోసం) కార్యక్రమం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహిస్తామని ఆర్డీఓ మోవిడి వాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందిస్తే వాటిని గడువులోగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

- **నేడు ఆశా వర్కర్ల ధర్నా**

మైలవరం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్లు విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్ వద్ద సోమవారం ఉదయం 11.30 గంటలకు ధర్నా నిర్వహిస్తారని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. కమల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో జరుగనున్న ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.